# నేరం చేసింది తాత శిక్షించింది మనవణ్ణి!



కోర్టుహాలు కిటకిటలాడుతోంది.

జడ్జిగారు తమ తీర్పు చదివి వినిపించారు.

"ముద్దాయికి శిక్ష విధించాలని జ్యూరీ సభ్యులు ఏకగ్రీవంగా చేసిన సిఫార్సుతో నేను ఏకీభవిస్తున్నాను. నేరం చాలా తీవ్రమైంది. కనుక నిజానికి ముద్దాయికి ఉరిశిక్ష వేయవలసింది. కాని, అసలు హత్య చేసింది అతని తాత. కనుక, కనికరించి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తున్నాను" అంటూ లేచారు జడ్జిగారు.

ప్రజల్లో కలకలం బయలుదేరింది. 'తాత చేసిన నేరానికి మనుమడికి శిక్ష వేయడమేమిటి?' అని ముక్కుమీద వేలేసుకున్నారు అంతా.

"ముద్దాయి తాతగారి అత్యాచారం మూలంగా ఒక బలహీనుడు మృతి చెందాడు. శిక్ష అనుభవించడానికి ఆ తాతగారు, తండ్రిగారు లేరు. కనుక, బతికివున్న ఆయన మనుమడికి శిక్ష పడాల్సిందే. ఇది చట్టపరమైనదే!" అంటూ తీర్పుని సమర్థించే పెద్దలు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

తీర్పు విన్న ముద్దాయికి కళ్లముందు ప్రపంచం గిర్రున తిరిగిపోతున్నట్లు అనిపించింది. అతనికి తోడేలు, మేకపిల్ల కథ జ్ఞాపకానికి వచ్చింది. "నువ్వు కాకపోతే నీ తాత ఈ నీటిని మలినం చేశాడు" అంటూ మేకపిల్లని తినేసింది తోడేలు. 'సర్వులకు సమాన న్యాయం సమకూరుస్తామని రాజ్యాంగంలో పొందుపరచిన ఈ స్వతంత్ర భారతదేశంలో నాకీ శిక్ష ఏమిటి!' అని నివ్వెరపోయాడు.

అతని ఆలోచనలు కాలగమనంలో వెనక్కి చొచ్చుకు పోయాయి.

'చరిత్రలో ఎందరో ముష్కర తురుష్కులు, హూణులవంటి వారు భారతీయులపై అత్యాచారాలు జరిపారు. వారి మాన, ప్రాణాలను హరించారు. దేవాలయాలను, ఆస్తులను సర్వనాశనం చేశారు. అయినా... వారి సంతతివారు భారత ప్రజానీకంలో కలిసిపోవడం వల్ల, వారికీ భారతీయులతో సమానావకాశాలు, గౌరవం కల్పించి సోదరులుగా ప్రేమిస్తున్నాం. వారి పూర్వులు చేసిన నేరానికి వారికి శిక్షలు వేయడం లేదే? మరి, నాకేమిటి ఈ శిక్ష?'.... ఎంత తర్కించినా తన దోషం ఏమిటో అతనికి అర్థంకాలేదు.

"లేదు. నేను నేరం చేయలేదు. మా తాత చేసిన నేరానికి నాకు శిక్ష వేయడం అన్యాయం!" అంటూ గట్టిగా అరవడం మొదలుపెట్టాడు ప్రకాశం.

""ఏమిట్రా కలవరిస్తున్నావు?" అంటూ వాళ్ళమ్మ వచ్చి నిద్రలో లేపింది.

అప్పుడు అర్థమయింది ప్రకాశానికి– తాను కన్నది 'కల' అని! కాని, కలలో చేసింది నిజమేగా! తాను ఫస్టుక్లాసులో పాసయినా, అగ్రవర్ణపు ముద్ర పడడంతో ఉద్యోగం దొరకలేదు. ఆ ఉద్యోగం మామూలుగా పాసయిన ఒకవెనుకబడిన బలహీనుడికి రిజర్వేషన్ పేరిట దొరికింది. ఆ విధంగా జరగడం అది మొదటిసారి కాదు. అలా ఎన్ని సార్లు జరిగిందో? ఆ ఆలోచనలు మనసుని కలచివేస్తున్నందువల్లనే తనకి అటువంటి కల వచ్చిందనుకున్నాడు.

'మరో జన్మంటూవుండి భారత దేశంలోనే పుట్టేమాటయితే, నన్ను బలహీనవర్గాల్లో పుట్టించు ప్రభూ!' అని మనసులోనే దేవుణ్ని వేడుకున్నాడు ప్రకాశం.

– తెలుగు వార పత్రిక... *21 జనవరి '82*